


మాయాచక్రం – 1

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 1

పూర్వం ఒకానొకప్పుడు, దేవతలకూ రాక్షసులకూ మధ్యని గొప్ప యుద్ధం జరిగింది. యుద్ధం జరుగుతూన్న సమయాన అకస్మికంగా ఒక చిత్రమైన చక్రం ఆకాశంలోనుంచి వచ్చి భూమిమీద పడింది. ఆ వెంటనే ఒక దేవత, ఒక రాక్షసీకూడా చక్రంతోపాటు భూలోకంలో పడ్డారు.

వాళ్లిద్దరూ, ఆ చక్రం 'నాదంటే నాది' అని పోరాడుకొంటూ ఆ దేశపు రాజువద్దకు పోయి విన్నవించారు. 'రాజా! ఇది నావద్దనుంచి దొంగిలించుకు పోబోతున్నదీ రాక్షసి' అని దేవత చెప్పింది. 'కాదు, కాదు, ఇది నాదే. నావద్దనుంచే ఈమె దొంగిలించబోతున్నది' అని రాక్షసి చెప్పింది.


రాజు ఆ చక్రాన్ని చేతులోకి తీసుకొని, అటు యిటు పరిశీలించి చూచాడు. పేరుకాని, ఆనవాలుగాని కనిపించలేదు. అందుచేత అది ఎవరిదైనదీ నిర్ధారణ చేయటానికి వీలులేకపోయింది.

అప్పుడు రాజు 'ఈ చక్రంలో మహిమ ఏమైనా ఉన్నదా?' అని వాళ్లను అడిగాడు. అందుకు ఇద్దరూ 'ఉంది, ఉంది' అని జవాబు చెప్పారు. అప్పుడు రాజు ముందుగా ఆ చక్రాన్ని రాక్షసి చేతికి ఇచ్చాడు.

రాక్షసి ఆ చక్రాన్ని చేతబట్టి, అనేకవిధాల అటుయిటు తిప్పిచూచింది. ఏమిచేసినా, ఎంతసేపు తాపత్రయపడినా ఏ మార్పూ లేదు, మహిమా కనబడ లేదు. అప్పుడు రాజు చక్రం తీసుకొని ఈసారి దేవతకు ఇచ్చాడు. దేవత దానిని భక్తితో కళ్లకు అద్దుకొని, రాజు అధిష్ఠించిన వెండిసింహాసనానికి తాకించే సరికల్లా అందరకూ ఆశ్చర్యం కొలిపేటట్టు అది బంగారు సింహాసనంగా మారి పోయింది! రాజు సంతోషించి, మాటప్రకారం ఆ మాయాచక్రాన్ని దేవతకే బహూకరించాడు.

ఇందుకు రాక్షసి మండిపోయింది. 'నా మాటకు ఎవరు ఎదురు చెబుతారో వాని తల గాడిదతల అగుగాక! వాడు నా తంగేడువనంలోని ఎర్ర కోటలో 'బానిసగా ఉండిపోవుగాక!' అని ఘోరంగా శపిస్తూ, తన మంత్ర దండంతో రాజును తాకి మాయమైంది.

వెంటనే రాజు తల గాడిద తలగా మారిపోయింది! ఇదిచూచి దర్బా రంతా గగ్గోలు బయిల్దేరింది!! అప్పుడు... —(ఇంకా ఉంది)



మాయాచక్రం – 2

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 2

రాక్షసి శాపంవల్ల రాజు తల గాడిద తలగా మారిపోగానే, దర్బారులో పెద్ద గగ్గోలు బయల్దేరిందికదా !—అటువంటి సమయంలో దేవత ముందుకువచ్చి, 'రాజా !—నీవేమీ భయపడకు. అసూయవల్ల రాక్షసి ఈ పని చేసింది. అసూయకు విరుగుడు అనురాగమే. కనుక, నీయందు అనురాగంచూపే చిన్నదానిని ఎప్పుడు పెళ్లాడతావో, ఆ క్షణమందే ఈ శాపంనుంచి విముక్తుడవవుతావు' అని చెప్పి, అంతర్ధానమైంది.

వెంటనే, రాజాజ్ఞప్రకారం చాటింపు జరిగింది. ఆ చాటింపు విని, దేశదేశాలనుండి అందకత్తెలైనటువంటి కన్యలు చాలామంది వచ్చారు. వారందరికీ రాజును వివాహం ఆడాలనేవుంది. కాని రాజుకు రాక్షసివల్ల జరిగిన అపకారం వారికి తెలీదు.

రాజు ఆ వచ్చిన అందకత్తెలనందరనూ చూచాడు. వారి అందచందాలను మెచ్చుకొన్నాడుకూడా. ఐతే ఏం లాభం?—ఎంతో ఆప్యాయంగా రాజును చూడవచ్చిన కన్యలందరూ రాజుతల చూచి అసహ్యించుకొని, వచ్చినదారినే తిరిగిపోసాగారు.

ఇక ఈ జన్మకింతేకాబోలు ననుకొని, రాజు నిస్పృహతో కోటలోకి పోబోతూవుండగా, ఒక పొన్నచెట్టుకింద అపురూపసౌందర్యవతి ఐన చిన్నది కంటబడింది. అయితే, పేదరాలు కావడంచేత నలుగురలోకి వచ్చి రాజును చూడటానికి బిడియపడింది. ఆ చెట్టుకిందనే నించుని ఆసక్తితో రాజును పరికిస్తున్నది.

ఈ సందర్భమంతా గ్రహించిన రాజు, మారుయోచన లేకుండా 'నీవే నా రాణివి!' అన్నాడు ఆమెతో. ఆ చిన్నది చిరునవ్వు నవ్వి, సిగ్గుతో తల వంచుకొన్నది.

అప్పటికప్పుడే పరిచారకులు వచ్చి ఆమెను అమూల్యములైన దుస్తులతోను, ఆభరణాలతోను అలంకరించారు. నగరం మధ్యనవున్న ఆలయంలో అతివైభవంగా వివాహం జరిగింది.

పెళ్ళి కాగానే, తనను ఏదో అడగడానికి రాణి ఎదురుచూస్తూవున్నట్టు కనిపెట్టాడు రాజు. 'రేపు ఉదయంవరకూ నన్నేవిషయంలోనూ ప్రశ్నించవద్దు. అటుపైన సంగతి సందర్భాలన్నీ నీకే తెలుస్తాయి' అన్నాడు. అన్నాడేకాని...

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 3

రాజు, తన రాణితో 'రేపు ఉదయంవరకూ నన్ను ఏమీ ప్రశ్నించవద్దు. అటుపైన సంగతి సందర్భాలన్నీ నీకే తెలుస్తాయి' అని చెప్పాడుకద ?

అయితే—ఆనాటి రాత్రి శయ్యామందిరంలో రాణి చెయ్యి నిద్రిస్తున్న రాజు తలకు తగిలింది. ఆమె లేచి చూడగా, అది తనింతకుముందు చూచిన గాడిద తలలాగ కనిపించలేదు. ఈ చిత్రం ఏమిటా అని దీపం వెలుగున పరీక్షగా చూచేసరికి, గాడిదతలా లేదు, ఏమీలేదు ! తన భర్త అతిరూపసుందరుడైన రాజకుమారుడు !! ఇది చూచి రాణి సంతోషానికి అంతులేకపోయింది.

రాణి ఈ సంగతి కనిపెట్టిందేకాని, తన తల ఈవిధంగా మారిపోయినట్టు రాజుకు తెలియనే తెలియదు. రాణి దీపం పట్టుకుచూడటంలో రాజుకు మెలకువ వచ్చింది. ఆమె ఆశ్చర్యంతో ప్రశ్నించింది. అప్పుడు తీరని విచారంతో రాజు ఇలా అన్నాడు :


'అయ్యో, దురదృష్టవంతురాలవు. రేపు ఉదయంవరకూ వుండమంటే వుండలేకపోయావు. అప్పటికిగాని నాకు పూర్తిగా శాపవిముక్తికాదు. నీవిలా ప్రశ్నించడంవల్ల శాపమిచ్చిన ఆ రాక్షసికి మళ్ళీ ఎప్పటి శక్తి వచ్చేసింది. నేనామెకు బానిసనై, ఆమె నివసించే తంగేడువనంలోని ఎర్రకోటకు పోవలసిందే...' అని అంటూనే రాజు మాయమైపోయాడు.

రాణి తన తప్పిదానికి చాలా దుఃఖించింది. భర్త ఎడబాటును భరించలేకపోయింది. రాజును వెతుక్కురావటానికని బయల్దేరింది.

ఆమె బయల్దేరి వెళ్ళగా వెళ్ళగా, దారిలో మునుపటి దేవత ఎదురయింది.

'అమ్మా ! తంగేడువనంలో ఎర్రకోట వుందట. అక్కడికి దారి చెప్పగలవా ?' అని ఆమెనడిగింది రాణి.

అందుకు దేవత 'తల్లీ !—నేను ఎర్రకోటనుగురించి విన్నానేగాని, అక్కడికి ఎన్నడూ పోలేదు. ఆ కోటలో ఒక రాక్షసి నివసిస్తూవుంది. అది మహా క్రూరమైంది. ఐనా, భయంలేదు. ఇదుగో నా మాంత్రిక ఉంగరమిస్తున్నాను. దీన్ని ధరించి వెళితే, నీవు తలచినపని జయమవుతుంది" అని చెప్పి, తన వేలి ఉంగరం రాణికిచ్చి, అది ఉపయోగించవలసిన పద్ధతి చెప్పింది.



మాయా చక్రం - 3

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 4

దేవత తన వేలి ఉంగరం రాణికి రక్షగా ఇచ్చి, దానిని ఉపయోగించే విధం చెప్పిందికదా!—అవసరమైనప్పుడల్లా రాణి ఆ ఉంగరం కళ్ళకు అద్దుకొని, మంత్రం పఠించి, ఏ చిన్న రాయికి తాకించినా, అది బంగారు మొహరుగా మారేది. దానితో రాణి బస, భోజనం అమర్చుకొని కాలక్షేపం చేస్తూ, దేశం తిరుగుతూ వుండేది.


ఆమె పోయిపోయి, ఒక ఊరు చేరుకున్నది. ఆ వూరిలోని ఒక గుడిసెలో ఒక వృద్ధురాలు కూర్చొని వుంది. రాణి ఆమెవద్దకు వెళ్ళి 'అవ్వా, అవ్వా!—తంగేడువనంలో ఎర్రకోట ఉందట. అక్కడికి దారి చెప్పగలవా?' అని అడిగింది.

అందుకు ఆ ముసలిది 'అమ్మాయీ!—నేను ఎర్రకోటనుగురించి విన్నానేకాని, అక్కడికి ఎప్పుడూ పోలేదు. ఐనా, రెక్కలగుఱ్ఱం ఒకటి అప్పుడప్పుడు ఆకాశంనుండి దిగివచ్చి, ఎర్రకోటకు పోతూ వుంటుంది. పోయి, అక్కడినుండి రత్నాలూ, మొహరీలూ తెచ్చుకొంటూ వుంటుంది. ఆ గుఱ్ఱం వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ అదుగో ఆ ఉద్యానవనంలోని మఱ్ఱిచెట్టుకిందనే ఆగుతుంది. అది వచ్చేవరకూ ఉండగలిగితివంటే, దానివెంబడే నీవు ఎర్ర కోటకు వెళ్లవచ్చు' అని చెప్పింది.

'అయ్యో, అవ్వా! అదేంమాట—నేను వచ్చిందే ఈ పనిమీదనాయె. కనుక, తప్పకుండా ఉంటాను' అని చెప్పి, రాణి ఆత్రంతో రోజులు లెక్కిస్తూ, రాత్రిళ్ళు ఆ ఉద్యానవనంలోని మఱ్ఱిచెట్టుకిందనే పడుకొంటూ, రెక్కలగుఱ్ఱం కోసం కనిపెట్టుకొని వుంది.

కొన్ని రోజుల తరువాత ఒకనాడు అర్ధరాత్రివేళ, హఠాత్తుగా ఒక మెరుపు మెరిసినట్టయింది. ఆవెంటనే, ఒక అందాల రెక్కలగుఱ్ఱం ఆకాశంనుండి కిందికి దిగివచ్చే జాడ కనిపించింది. అలా చూస్తూవుండగానే ఆ గుఱ్ఱం సరీగా ముసలిది చెప్పినట్టుగా, ఉద్యానవనంలోని మఱ్ఱిచెట్టుకిందకే వచ్చి ఆగింది.

రాణి ఆ గుఱ్ఱందగ్గరకు వెళ్ళి, తన చరిత్ర అంతా వెలపోసుకొన్నది. చివరకు 'ఓ అశ్వరాజా!—నీ మహిమనుగురించీ, నీ ఉపకారబుద్ధినిగురించీ చాలా విన్నాను. ఎలాఐనా నన్ను ఆ ఎర్రకోటకు చేర్చి పుణ్యంకట్టుకోవలిసింది' అంటూ దీనంగా వేడుకున్నది. అప్పుడు ఆ రెక్కలగుఱ్ఱం...



మాయాచక్రం – 4

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 5

అప్పుడు ఆ రెక్కల గుర్రం రాణిపైన జాలిపడి, మానవభాషలో "రాణీ!—ఈపాటి దానికే అంత ప్రాధేయమెందుకు? ఎర్రకోటకు తీసుకువెళతాలే, దిగులు పడకు" అంటూ ధైర్యంచెప్పింది.

మరునాటి ఉదయంవరకూ అది విశ్రాంతితీసుకొన్నతరువాత రాణిని తన వీపుమీద ఎక్కించుకొని ఆకాశమార్గాన దౌడుతీయ నారంభించింది. అంత ఎత్తున అతివేగంగా పోతూవుంటే, రాణికి అనేకమైన ప్రపంచపు వింతలు కంటబడసాగినై.

అయితే, ఆ చిత్రాలను చూచి మనసులో ఆనందించగల స్థితిలో లేదు, రాణి. ఇప్పుడెంతసేపూ ఆమె దృష్టి ఎలా ఎర్రకోట చేరుకోవడం, ఎంతట చేరుకోవడం, చేరుకొని తన భర్తను ఎలా దర్శించడం?—అనే విషయాలపైనే ఉండిగాని, మరే విషయానికీ చోటులేదు.

ఇటువంటి ఆత్రంతో పోతున్న రాణి ఒక్కసారి కిందికిచూడగానే, మాసిన గుడ్డలు కట్టుకొనివున్న ఒక పేదరాలు కనిపించింది. వెంటనే రాణికి మెరపు వంటి ఒక ఆలోచన స్ఫురించి, గుర్రంతో ఇలా అన్నది:

"ఓ అశ్వరాజా!—నా భర్త ఇచ్చిన విలువైన దుస్తులతో నే నిప్పుడు ముస్తాబైవున్నాను. నేను ఫలానా అని ఎవరైనా సులువుగా గుర్తించగల్గుతారు. ఐతే, ఈ స్థితిలో నన్ను ఎవరూ తెలుసుకోకుండా ఉండడమే అన్నివిధాలా నాకు మేలు. కనుక, నా వస్త్రాలు అదుగో, ఆ పేదరాలికిచ్చి, ఆమె గుడ్డలను నేను ధరిస్తాను" అని చెప్పింది.

రెక్కలగుర్రం రాణి వుద్దేశాన్ని ఆమోదించి, వెంటనే భూలోకానికి దిగింది. అప్పుడు రాణి తన అమూల్య వస్త్రాభరణాలన్నీ ఆ పేదరాలికిచ్చి, ఆమె కట్టిన బట్టలనూ, నల్లపూసలూ మొదలైన పేదవాళ్ల ఆభరణాలనూ తను పుచ్చుకొని ధరించింది.

ఈ మారువేషంతో రాణి మళ్ళీ గుర్రం ఎక్కి, రోజల్లా ప్రయాణించేయగా అల్లంతలో ఎర్రటి తంగేడువనం, ఆ వనంలో ఆకర్షణీయమైన ఎర్రకోట స్పష్టంగా కనిపించినై. అప్పుడు గుర్రం 'మనం రావలసిన చోటికి వచ్చేశాం!' అని రాణికి చెప్పింది. రాణి చాలా సంతోషించింది. తరువాత...



మాయాచక్రం – 5

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 6

రావలసిన చోటికి వచ్చేశామని గుర్రం చెప్పగానే రాణి అంతులేని సంతోషాన్ని పొందింది. 'అశ్వరాజమా!—నీ పని ఇంతటితో తీరిపోలేదు. నేను మళ్ళీ వచ్చేవరకూ నీవు ఇక్కడనే ఉండాలి. ఈ ఉపకారం చేయకతప్పదు' అన్నది.

అందుకు రెక్కల గుర్రం 'రాణీ!— ఈ ఎర్రకోట దేవలోకానికికూడా కనిపిస్తూవుంటుంది. ఇక్కడ వుండే రత్నాలూ మొహిరీలు దేవతలకు ఎంతో ఇష్టం. అందుచేత వారి ప్రభావంవల్ల నే నీ లోకానికి వచ్చి, రాక్షసికి తెలియకుండా కానుకలు పట్టుకుపోతూ వుంటాను' అని చెప్పింది.


ఈ మాటకు రాణి 'నాకోసమని నీవు రేపటివరకూ వుండు. ఆవిధంగా యిద్దరమూ వచ్చినపని ముగించుకుని వెళ్ళిపోవచ్చు' అన్నది.

రాణి ఇలా అంటూవుండగానే కోటలోపలినుంచి రాక్షసి వచ్చి, వింత గుర్రాన్ని చూసి ఆశ్చర్యపడింది. 'అమ్మాయీ!—ఎవరు నీవు? ఇక్కడి కెలా వచ్చావు? ఎందు కొచ్చావు? ఈ గుర్రం ఎవరిది?....' అంటూ ఆత్రంతో ప్రశ్నలవర్షం కురిపించింది.

అప్పుడు రాణి ధైర్యం వహించి, 'నేను మంత్రమహిమలు తెలిసిన ఒక స్త్రీని. ఇది దేవతా అశ్వం. నే నీ గుర్రంమీద ఎక్కి లోకాలు చూచుకొంటూ వస్తున్నా. దారిలో ఈ ఎర్రకోట ముచ్చటగా కనిపిస్తే, ఏమిటో చూదామని ఇక్కడ దిగాను' అని బదులు చెప్పింది.

రాక్షసి ఆమెను ఆదరించి లోపలికి తీసుకుపోయింది. సమస్త మర్యాదలూ చేసింది. చివరకు, తన అంతఃపురంలోకి తీసుకువెళ్ళి, కురూపి ఐన తన కూతురిని చూపించి, 'అమ్మా!—ఇది నా బిడ్డ. దీనికి పెళ్ళిచేదామని ఒక చక్కటి రాజకుమారుణ్ణి పట్టుకవచ్చాను. ఇతర స్త్రీలను వరించకుండా అతని తలను గాడిద తలగా మార్చివేశాను. ఐతే, నాకు శత్రువైన ఒక దేవత— అనురాగవతి ఐన భార్య దొరికితే రాజుకు మామూలు స్వరూపం వచ్చేటట్టు విమోచనమార్గం చెప్పింది. నా కూతురుకు అతనిపైన అనురాగమున్నదిగాని, అతనికి యింతమాత్రం ఇష్టంలేదు. నీ మహిమచేత ఈ పని అనుకూలం చేసి పెట్టగలవా?' అని అడిగింది.

'ఓ. ఇదెంత పని? ఇదుగో చూడు' అన్నది రాణి. ఇలా అంటూ—



మాయాచక్రం - 6

మాయాచక్రం (అట్టచివరి బొమ్మ) - 7


రాక్షసి కోరికను రాణి తీరుస్తానన్నదికదా! ఆమె ఎవ్వరికీ కనబడకుండా తన వేలిఉంగరాన్ని కళ్ళకు అద్దుకొని, రాక్షసికూతురుకు తాకించింది. అందరకూ ఆశ్చర్యమయేట్టు, మరుక్షణంలో ఆ పిల్ల ఒక చక్కని మానవకన్యగా మారి పోయింది! రాక్షసి ఆనందానికి అంతులేదు.

ఇప్పుడు రాక్షసి, రాణిని ఒక మహాత్మురాలుగా ఎంచి, తనకుతానై ఆమెకు లొంగిపోయింది. లొంగిపోగానే, వివేకవతి ఐన రాణి తనకు మంత్ర దండం కావాలన్నది. మారుమాటాడకుండా, సంతోషపూర్వకంగా రాక్షసి తన మంత్రదండం ఇచ్చివేసింది. అప్పుడు రాణి ఆమెతో 'దీనిని నేను లోకోపకారార్థం ఉపయోగిస్తాను' అని చెప్పింది.

అటుతరవాత రాణి కోటలోపలకు పోయి, బంధింపబడివున్న తన భర్తను చూచింది. ఎప్పుడైతే అనురాగవతి ఐన రాణి కంటబడిందో, ఆ క్షణమందే రాజుకు శాపం తొలగింది. గాడిదతల మాయమై, మామూలురూపం వచ్చేసింది. రాజు విస్మితుడైనాడు.

'నా తొందరపాటును దిద్దుకోడానికి ఇంతపని చేయవలిసి వచ్చింది!' అంటూ రాణి, తన కథ సంతటినీ చెప్పసాగింది. అంతలోనే ఆనాటి దేవత ప్రత్యక్షమై, 'రాణీ!—నా ఉంగరం నాకివ్వు' అని అడిగింది. రాణి ఇచ్చింది. ఉంగరం దేవతచేతికి తాకగానే అది మళ్లీ మాయాచక్రంగా మారిపోయింది!!

అప్పుడు దేవత—'రాణీ!—ఈ చక్రంకోసమే నాకూ రాక్షసికి మధ్యని వైరం. దీనినిగురించే నీ భర్త తీర్పుచెప్పి, నా కిప్పించాడు. ఐతే, ఈ చక్రంవల్లనే నీ భర్తకు శాపం తగిలింది. దాని ఫలితంగా నీవున్నూ కష్టాలపాలైనావు. ఏమైతేనేం చివరకు, ఉంగరంరూపంలో నీకు అంగరక్షగా నేనిచ్చిన ఈ చక్రమే మీ కష్టాలు గట్టెక్కించింది. వృద్ధురాలు, మామిడిచెట్టు, రెక్కలగుర్రం అన్నీ నా కల్పన. ఇటుపైన రాక్షసివల్ల లోకానికి బాధలేదు. ఆమె ఇష్టంవచ్చినచోట ఉండనీ. సుందరవతిగా మార్చబడిన ఆమెకూతురు మిమ్మల్నే ఆశ్రయించుకొనివుంటుంది. ఆమెక్షేమం చూడండి. రెక్కలగుర్రం ఎక్కి మీముగ్గురూ మీ రాజ్యం చేరుకొని, సుఖంగా వుండండి. ఇదుగో, నా మాయాచక్రం తీసుకొని, నే పోతున్నాను!' అంటూ దేవత అదృశ్యమైపోయింది. ★



మాయాచక్రం – 7